క్లుప్తంగా

అల్లంపాటి లోకేశ్వర్‌రెడ్డితో ఎమ్మెల్యే భేటీ



లోకేశ్వర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రామిరెడ్డి

అల్లూరు: మినర్వా గ్రాండ్స్ అధినేత, దివంగత అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి తనయుడు అల్లంపాటి లోకేశ్వర్‌రెడ్డిని అల్లూరులోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి బుధవారం కలిశారు. ఎమ్మెలే వెంట కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, నాయకులు సామంతుల సురేష్‌రెడ్డి, గోళ్ల రాజేష్, సుధీర్‌రెడ్డి, జాంబీ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసి, అదే రోజు నుంచి 25వ తేదీ వరకు, ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 26న పరిశీలన, 29న ఉపసంహరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలు పొందుపర్చాలన్నారు. అభ్యర్థులు డిపాజిట్ నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓ నెహ్రూబాబు పాల్గొన్నారు.

మృతులకు ఘన నివాళులు



చామదలలో మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: మండలంలోని చామదలకు చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురు రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం చామదలకు చేరుకుని మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ విషాద ఘటనను చూసి రాజగోపాల్‌రెడ్డి విచలితులయ్యారు. మృతుల కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వంటేరు లక్ష్మీనరసారెడ్డి, పసుపులేటి ప్రసాద్, దేవరపల్లి విజయ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించండి

ఆత్మకూరు: ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయ రెడ్డి కోరారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కె మల్లికార్జునరెడ్డి, వి సుధాకర్‌రెడ్డి, జి విజయభాస్కర్ రెడ్డి, షేక్ మస్తాన్, కరటంపాటి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



పొదలకూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఓ వరకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది డెమో ద్వారా అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. మంటలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రూపుల వార్.. నిస్తేజంలో కేడర్

వ్యతిరేక వర్గంతో టీడీపీ అభ్యర్థి కాకర్లకు తలనొప్పి

- టీడీపీ ప్రచారానికి జన స్పందన కరువు
- వైఎస్సార్‌సీపీలోకి జారుకుంటున్న కేడర్
- మరో వైపు ప్రచారంలో మేకపాటి జోష్

టీడీపీ ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్‌కు ఎన్నికలకు ముందే భవిష్యత్ దర్శనమిస్తోంది. సీనియర్ అయిన మాజీ ఎమ్మెల్యేను కాదని టికెట్ దక్కించుకున్న కాకర్ల పార్టీ నేతలను సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారు. ఆఖరి వరకు టికెట్ నాదే అంటూ బీరాలు పలికిన బొల్లినేని వెంకటరామారావు అవమానభారంతో రగిలిపోతున్నారు. నియోజకవర్గంలో బొల్లినేనికి బలమైన కేడర్ ఉంది. వీరంతా టీడీపీ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. కాకర్లను ఓడించడమే తన లక్ష్యమని బొల్లినేని బహిరంగంగానే సవాల్ విసిరారు. అసమ్మతి వర్గంతో కాకర్లకు తలనొప్పిగా మారింది. రెండు గ్రూపుల మధ్య వార్‌తో కేడర్‌లో నిస్తేజం నెలకొంది.



ఉదయగిరి : రాజకీయాలకు కొత్త అయినా కాకర్ల సురేష్‌కు టీడీపీ సీటు ఇవ్వడం, టికెట్ ఆశించి భంగపడిన బొల్లినేని వెంకటరామారావు తీవ్ర అసంతృప్తితో పార్టీ ప్రచారానికి దూరంగా ఉండడంతో ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఓ వైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరో వైపు కాకర్ల నిర్వహించే ఎన్నికల ప్రచారంలో జన స్పందన అంతంత మాత్రంగానే ఉండడంతో టీడీపీ పరిస్థితికి అద్దం పడుతోంది. ఇటీవల కలిగిరిలో టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి కాకర్ల నిర్వహించిన ప్రచార ర్యాలీలో పట్టుమని పాతిక మంది కూడా లేని పరిస్థితి. దీంతో వేమిరెడ్డి సైతం అసహనం వ్యక్తపరిచినట్లు సమాచారం. కాకర్ల సురేష్ డబ్బు వెదజల్లుతూ కూలీ ఇస్తామని చెప్పినా జనం రాకపోవడంతో పార్టీ విజయంపై కేడర్‌లో నమ్మకం సడలుతోంది.

బొల్లినేని వర్గీయుల నుంచి తీవ్ర వ్యతిరేకత

ఉదయగిరిలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వ్యాపారాలు వదిలి వేసి, అధినేత ఆదేశాల మేరకు రూ.కోట్లు ఖర్చు చేసి పార్టీని నిలబెట్టిన బొల్లినేనికి సీటు నిరాకరించడంతో ఆయన వర్గీయులు కాకర్లకు సహకరించడం లేదు. ముఖ్యంగా సొంత సామాజిక వర్గం నుంచే కాకర్లకు సహకారం అందడం లేదు. పార్టీ అధినేత చంద్రబాబు ఉదయగిరి పర్యటనలో బొల్లినేని, కాకర్ల మధ్య సయోధ్య కుదర్చలేకపోయారు. కాకర్ల, బొల్లినేని వర్గీయుల మధ్య వార్ కొనసాగుతోంది. ఇటీవల కాకర్ల క్యాంపు కార్యాలయంలోనే బొల్లినేని అనుచరుడు కొండాపురం మండల టీడీపీ అధ్యక్షుడు ఓంకారం, కాకర్ల అనుచరుడు మాజీ జెడ్పీటీసీ దామా మహేశ్వరరావుకు మధ్య గొడవ చొక్కాలు పట్టుకునే వరకు వెళ్లింది. దీంతో మన స్థాపం చెందిన ఓంకారం పార్టీకి, పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చారు.

మేకపాటిని తట్టుకోలేపోతున్నాం..

ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని తట్టుకోలేకపోతున్నామని కాకర్ల శిబిరం గొల్లుమంటోంది. ఎన్నికల ప్రచారంలో మేకపాటి స్పీడ్ పెంచారు. ఆయన తనయుడు అభినవ్ కూడా తండ్రికి చేదోడుగా ఉంటూ ప్రతి పల్లెకు వెళ్తూ పార్టీ నేతలను కలుస్తున్నారు. ఇప్పటికే రాజారెడ్డి గడప గడప కార్యక్రమంలో 80 శాతం మేర తిరిగారు. అనంతరం రచ్చబండ, విజయ సంకల్పయాత్ర, జగనన్న మాట.. రాజన్న బాట వంటి కార్యక్రమాలతో ప్రజల్లోనే ఎనిమిది నెలలకుపైగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మేకపాటి కుటుంబం నియోజకవర్గ రాజకీయాల్లో 40 ఏళ్ల నుంచి కీలకంగా ఉండడంతో ప్రజల వద్ద నుంచి భారీగా మేకపాటి రాజారెడ్డికి మద్దతు లభిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాకర్ల, మేకపాటి రాజారెడ్డికి కనీస పోటీ కూడా ఇవ్వలేరు అని రాజకీయ పండితులు అంచినా వేస్తున్నారు.

అగ్ని ప్రమాదాల్లో ప్రాణాలకు తెగించి కాపాడుతాం



అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని అరికట్టే విధానం ప్రదర్శిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆ మంటలను అదుపు చేయడంతో పాటు అందులో చిక్కుకున్న వారిని ప్రాణాలకు తెగించి అగ్నిమాపక సిబ్బంది కాపాడుతారని ఆ శాఖ ఆత్మకూరు అధికారి టి.రమేష్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం బైపాస్ రోడ్డులోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రమాదాలపై అవగాహన, నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాల్లో తప్పించుకునేందుకు ఉపాయాలను ప్రయోగాత్మకంగా చేసి చూపారు. ఎత్తైన భవనాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాపాయం తప్పదని, ఆ సమయంలో సిబ్బంది ప్రత్యామ్నాయ మార్గాల (రోప్‌లు, తాళ్ల నిచ్చెనలు) ద్వారా ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను కాపాడడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె శ్రీనివాసరావు, ఎ సుధాకర్, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశీర్వాదంతో నామినేషన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఉదయం ఎనిమిది గంటలకు కలుగోళమ్మ ఆలయంలో పూజలు
- ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : కావలి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, భగవంతుని దయతో మూడోసారి ఎమ్మెల్యేగా గురువారం నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బుధవారం మాట్లాడారు. ఉదయం ఎనిమిది గంటలకు కావలి గ్రామ దేవత కలుగోళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అభిమానులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా కావలి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయి రెడ్డి, అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులతో పాటు ముఖ్య నాయకులంతా హాజరవుతున్నారు. ప్రజలు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కూడా అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు గత రెండు ఎన్నికల్లో తనపై నమ్మకంతో అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. ప్రజాదరణతో పాటు పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో మూడో సారి కూడా కావలి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిందన్నారు. ప్రజలు ఈసారి కూడా తనను అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కావలిని కనకపట్నంగా తీర్చిదిద్దడం, నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన ద్వారా భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. కావలి ప్రశాంతతను చెడగొట్టే వ్యక్తులకు అవకాశం ఇవ్వకుండా మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘ సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘ సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సల నగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ సంఘ భవనంలో శుక్రవారం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్ఎం గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి బుధవారం తెలిపారు. నెల్లూరు సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. వృద్ధులకు వచ్చే వివిధ ఆరోగ్య సమస్యలపై ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్కే కాలేషాసాహెబ్ అవగాహన కల్పిస్తారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కుమారుడు, కుమార్తెల సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నేతలు

కావలి: పట్టణంలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో బుధవారం తుమ్మలపెంట పంచాయతీ చిన్నరాముడుపాలెంకు చెందిన టీడీపీ నేతలు మామిళ్లశెట్టి, కోదూరు వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుమారుడు రామిరెడ్డి బాలసాకేత్‌రెడ్డి, మహిమ దంపతులు, కుమార్తె సంహిత, అఖిలేష్‌రెడ్డి దంపతులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

చేజర్ల: మండలంలోని బోడిపాడులో పెరుమాళ్లపాడు, తూర్పుకంభంపాడుకు చెందిన 30 కుటుంబాలు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికి ఎమ్మెల్యే కండువా పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



చేజర్ల: ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

టీడీపీ ముస్లిం మైనార్టీ యువకులు వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ముస్లిం మైనార్టీ కార్యకర్తలు



మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రుద్రకోట యువకులు

కావలి: పట్టణంలోని జెండా చెట్టు ప్రాంతానికి చెందిన టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ముస్లిం మైనార్టీ యువకులు 30 మంది జై జగన్, జై ప్రతాపన్న అంటూ నినాదాలు చేసుకుంటూ బుధవారం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. తామంతా టీడీపీ కార్యకర్తలమని, ఇక నుంచి తాము ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీలో పని చేస్తామన్నారు. ఎమ్మెల్యే వారిని సాదరణంగా ఆహ్వానించి ఆలింగనం చేసుకున్నారు. పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నపై నమ్మకంతో, తనపై అభిమానంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు.

విష్ణు సమక్షంలో..

కావలి మండలం రుద్రకోట గ్రామానికి చెందిన పలువురు యువకులు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కష్టపడి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి. విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కోడ్ ఉల్లంఘన



ఫీల్డ్ అసిస్టెంట్ హజరత్తమ్మ ఫోన్‌కు టీడీపీ స్టిక్కర్ ఉన్న దృశ్యం

చేజర్ల: ఉపాధి హామీ పథం ఫీల్డ్ అసిస్టెంట్ తన ఫోన్‌కు వెనుక భాగంలో చంద్రబాబు ఫొటోతో కూడిన స్టిక్కర్ అంటించుకుని ఫీల్డ్‌లో పని చేస్తూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో మండలంలోని బోడిపాడు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్‌కే హజరత్తమ్మ ఉపాధి హామీ పనుల వద్ద పార్టీ గుర్తును ప్రచారం చేస్తూ ఆ పార్టీపై తన అభిమానాన్ని చాటుకుంది. సహచర సిబ్బంది ఇది అభ్యంతరకమని చెప్పినా తాను ఇలాగే చేస్తానంటూ ఎన్నికల కమిషన్ నిబంధనలనే బేఖాతరు చేస్తోందని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న ఉద్యోగి అయి ఉండి ఇలా ఒక పార్టీకి మద్దతుగా ప్రచారం చేయడాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓను ప్రశ్నిస్తే.. వచ్చేది మా గవర్నమెంటే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు ఏపీఓపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఆత్మకూరు: సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



ఆత్మకూరు: సుందరమ్మ కోదండ రామాలయం గజ వాహనంపై రాములోరు



ఆత్మకూరురూరల్: గండ్లవేడులో సీతారాముల కల్యాణం



కలిగిరి: ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు

ఆత్మకూరు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పలు రామాలయాల్లో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాలను భక్తులకు వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. పంటవీధి కోదండరామాలయం, ఎల్ఆర్‌పల్లి రామాలయం, సుందరమ్మ కోదండ రామాలయాల్లో భారీ స్థాయిలో అన్నదానాలు నిర్వహించారు.

గజవాహనంపై రాములోరు

శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సుందరమ్మ కోదండ రామాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గజ వాహనంపై రాములోరి ఉత్సవం వైభవంగా సాగింది. స్వామివారి ఉత్సవ మూర్తిని అలంకరించి, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన గజవాహంపై ఉంచి మేళతాళాలు, బాణసంచా వేడుకల నడుమ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు, స్వామి వారికి కొబ్బరికాయలు సమర్పించుకున్నారు.

వైభోగం.. సీతారాముల కల్యాణం

ఆత్మకూరురూరల్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గండ్లవేడులో బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. భద్రాచలం సీతారాముల కల్యాణానికి సరైన ముహూర్తంలో ఆచార సంప్రదాయాల ప్రకారం శాస్త్రబద్ధంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కొల్లి దొరస్వామినాయుడు, సుస్మిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం అన్నదానం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

సీతారాముల కల్యాణోత్సవం

ఉదయగిరి: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి పర్వదిన వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. గండిపాళెం, ఉదయగిరిలోని కోదండ రామస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిప్రపత్తులతో శ్రీరామనవమి వేడుకలు

దుత్తలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు జరుపుకున్నారు. సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. దుత్తలూరు ఊరకొండపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సంగంలో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వేడుకగా రాములోరి కల్యాణం

అల్లూరు: మండలంలోని పురిణి కొత్తపాళెం కోదండ రామస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరామనవమి విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, స్వామి అమ్మవార్లకు అభిషేకం, సీతా సమేత కోదండ రామస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

జలదంకి: మండలంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణక్రాకలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, విశేషాభిషేకాలు, స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత కమనీయంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వేలమూరి నరోత్తమరెడ్డి- అరుణమ్మ దంపతులు వ్యవహరించారు.



చేజర్ల రామాలయంలో సీతారాముల కల్యాణం

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

సంగం: మండలంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని వేడుకలను వైభవంగా నిర్వహించారు. సంగం రామచంద్రాపురంలోని రామాలయంలో, ఆంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని జంగాలదొరువులో కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను, అమ్మవార్ల కల్యాణం కనుల విందుగా సాగింది. కల్యాణానికి భాస్కర్‌నాయుడు, అరుణమ్మ దంపతులు, వెంకటేశ్వర్లు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి

కలిగిరి: మండలంలో శ్రీరామనవమి వేడకలను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు అంగరంగ వైభవంగా జరిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వెలగపాడు పంచాయతీ కొత్తూరులో నిర్వహించిన సీతారాముల కల్యా మహోత్సవ వేడుకల్లో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక నేత నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మేకపాటిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



అల్లూరు: సీతారాముల కల్యాణం



బ్రాహ్మణక్రాకలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

సోమశిల: అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం ఉత్సవాలను నిర్వహించారు. అనంతసాగరం చెరువు కట్ట వద్దనున్న ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు పూల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వాడవాడలా నవమి వేడుకలు

చేజర్ల: మండలంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. చేజర్ల నడివీధి రామాలయంలో వేద పండితులు వైభవంగా సీతారాముల కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.